

మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పక్కన మంత్రి కొండా సురేఖ

హామీలన్నీ నెరవేరుస్తాం..



వేడుకల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు



మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్ రెడ్డి



ఐడీవోసి గ్రౌండ్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, కలెక్టర్ సత్య శారద

- పదేళ్లలో నియంతల పాలన చూశారు.. ఇప్పుడు ప్రజాపాలన చూస్తున్నారు
- రాష్ట్రంలో విద్యావ్యవస్థను మెరుగుపరుస్తున్నాం
- వరంగల్‌ను రెండో రాజధానిగా అభివృద్ధి చేయాలనేదే లక్ష్యం
- ప్రజాపాలన దినోత్సవంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి
- వరంగల్‌లో జాతీయ జెండా ఆవిష్కరణ

వరంగల్ సిటీ, సెప్టెంబరు 17: ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీలన్నీ నెరవేరుస్తామని, గత పదేళ్లలో ప్రజలు నియంతల పాలన ఎట్లుందో చూశారని, ఇప్పుడు ప్రజాపాలనను చూస్తున్నారని రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాలు, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా ఆజంజాహిమిల్ సమీపంలోని ఐడీఓసీ మైదానం (కలెక్టరేట్ నిర్మిత ప్రాంతం)లో ఏర్పాటు చేసిన వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి దొరలు, గడీల పాలనలో అష్టకష్టాలు పడిన తెలంగాణ ప్రజలకు ఆనాటి నుంచి ఈనాటి వరకు కాంగ్రెస్ ప్రభుత్వాలు ప్రజాపాలన రుచి చూపిస్తున్నాయన్నారు. ఉమ్మడి ఏపీ నుంచి తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక నయా నిజాం రాష్ట్రాన్ని పాలించాడని, గత పదేళ్ల పాలనలో నియంతలు ఎట్లుంటరో ప్రజలకు చూపించారని ఎద్దేవా చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ పాలన ప్రజారంజకంగా, ప్రజా మనోభీష్టం మేరకే సాగుతుందన్నారు. పాలకులు తప్పు చేస్తే నిలదీసే స్వేచ్ఛ ఈ రోజు రాష్ట్రంలో ఉందన్నారు. ఎన్నికల వేళ ఇచ్చిన హామీల్లో ఇప్పటికే బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్య సేవల పరిమితిని రూ.5లక్షల నుంచి రూ.10లక్షలకు పెంపు, రూ.500కే వంట గ్యాస్, 200యూనిట్ల లోపు గృహ విద్యుత్ వినియోగదారులకు జీరోబిల్లు అమలు చేస్తున్నామన్నారు. భద్రాద్రిలో శ్రీరాముని సన్నిధిలో ఇందిరమ్మ ఇళ్ల గృహ నిర్మాణ పథకానికి శ్రీకారం చుట్టామని, ప్రతీ నియోజక వర్గానికి 3,500 ఇందిరమ్మ ఇళ్లను నిర్మిస్తామని తెలిపారు. ఎంతో ప్రతిష్టాత్మకమైన వ్యవసాయం, దాని అనుబంధ రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని, అందులో భాగంగానే బడ్జెట్‌లో ఏకంగా రూ.72వేల కోట్లను కేటాయించామని తెలిపారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 27 రోజుల్లోనే 22లక్షల మంది రైతులకు రూ.18వేల కోట్ల రైతు రుణమాఫీ చేసిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కిందన్నారు. విద్యావ్యవస్థను కూడా మెరుగుపరుస్తున్నామని, ఇప్పటికే విద్యా కమిషన్ ఏర్పాటు చేశామన్నారు. అంగన్‌వాడీలను ప్రీ ప్రైమరీ స్కూళ్లగా మార్చబోతున్నామని, ప్రాథమిక పాఠశాలల నుంచి విశ్వవిద్యాలయాల వరకు నాణ్యమైన విద్యాబోధన, నైపుణ్య శిక్షణ, ఉపాధి కల్పనకు మిషన్ మోడ్‌లో చేయాలని సంకల్పించామన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థుల కోసం ప్రతీ నియోజకవర్గంలో ఒకే ఆవరణలో 25 ఎకరాల స్థలంలో ఇంటి గ్రేటెడ్ మోడల్ స్కూళ్లను నిర్మించబో తున్నట్లు ప్రకటించారు. ఇటీవల రంగారెడ్డి జిల్లాలో యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీకి శంకుస్థాపన చేయడం జరిగిందని, విద్యా రంగంలో ఇదో విప్లవాత్మకమైన మార్పన్నారు. ఈ యూనివర్సిటీకి మహింద్రా గ్రూప్ అధినేత ఆనంద్ మహింద్రాను చైర్మన్‌గా నియమించడం జరిగిందన్నారు.

రెండో రాజధాని స్థాయిలో..

వరంగల్ నగరాన్ని రెండో రాజధాని స్థాయిలో అభివృద్ధి చేయాలనే సంకల్పంతో కార్యాచరణ రూపొందిస్తున్నామని మంత్రి తెలిపారు. 2050 వరకు జనాభాను దృష్టిలో పెట్టుకుని మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తున్నామని, ఈ మాస్టర్ ప్లాన్‌లో అన్ని రంగాలకు ప్రాధాన్యం ఉందన్నారు. నగరంలో వరద ముంపునకు గురవకుండా వరదనీరు సాఫీగా వెళ్లడానికి నాలాలను విస్తరిస్తున్నామని, డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్‌ను బలోపేతం చేస్తున్నామన్నారు. వరంగల్ పాత బస్‌స్టేషన్ స్థానంలో రూ.80కో ట్లతో అధునాతన బస్‌స్టేషన్ వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్య లు తీసుకున్నామని మంత్రి తెలిపారు. రూ.80కోట్లతో నిర్మిస్తున్న సమీకృత కలెక్టరేట్ పనులు శరవేగంగా పూర్తి చేస్తామన్నారు. కాకతీయ టెక్స్‌టైల్ పార్క్ పనులు ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో అన్ని హంగులతో త్వరలోనే పూర్తి చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, వరంగల్ ఎంపీ కడియం కావ్య, కలెక్టర్ సత్యశారద, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, కుడా చైర్మన్ ఇనుగాల వెంకట్రామిరెడ్డి పాల్గొన్నారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న మంత్రి

ఎంజీఎంలో ప్లేట్‌లెట్ కౌంట్ యంత్రం

- ప్రారంభించిన మంత్రులు పొంగులేటి, సురేఖ
- ఆసుపత్రిలో వైద్య సేవలపై ఆరా
- డయాలసిస్ విభాగంలో మరో 14 పడకలు



ఎంజీఎంలో రోగులతో మాట్లాడుతున్న మంత్రులు పొంగులేటి, సురేఖ

వివరాలు : 5లో..

అభివృద్ధి కోసం ఎన్ని నిధులైనా ఇస్తాం

- విద్య, వైద్యం సర్కారుకు రెండు కళ్లు
- ఎంజీఎం ఆస్పత్రిలో మందుల కొరతను సహించం
- ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి
- కలెక్టరేట్‌లో వాడీవేడిగా 'పశ్చిమ' అభివృద్ధి సమీక్ష

హనుమకొండ కలెక్టరేట్, సెప్టెంబరు 17: ఇది పేదల ప్రభుత్వమని, జిల్లా అభివృద్ధికి ఎన్ని నిధులైనా ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ, ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధి పనులపై హనుమకొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల ఇళ్ల స్థలాల అంశం, పోచమ్మకుంట మోడల్ గ్రేవీ యార్డ్, గ్రేటర్ వరంగల్ పరిధిలోని పార్కు స్థలాల ఆక్రమణ, హనుమకొండ హంటర్‌రోడ్‌లోని రీజినల్ సైన్స్ సెంటర్ భూమి ఆక్రమణ, నాలాల ఆక్రమణలు, గ్రేటర్ వరంగల్ మునిసిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన పనులు, వాటి పురోగతి, నిధుల కేటాయింపు, డంపింగ్ యార్డు, కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనులు, ఓఆర్ఆర్ పనులు, కాజీపేట ఆర్వోబీ, తదితర అంశాలపై హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్‌లు, పి.ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద, మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, ఆర్డీవో వెంకటేష్, కుడా పీవో అజిత్‌రెడ్డి, మునిసిపల్, సాగునీటి పారుదల, ఆర్ అండ్‌బీ, తదితర శాఖల అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించారు.

మంత్రి మాట్లాడుతూ.. విద్య, వైద్యం ప్రభుత్వానికి రెండు కళ్లలాంటివన్నారు. స్మార్ట్‌సిటీ నిధులు ఈనెలాఖరు వరకు విడుదలయ్యేలా చేస్తామని హామీ ఇచ్చారు. ఎంజీఎం ఆస్పత్రిలో మందుల కొరత ఉంటే సహించమని, వైద్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంజీఎం ఆస్పత్రికి సంబంధించిన నివేదికను అందించాలని వరంగల్ జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. నగరంలో నాలాలను ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. కాళోజీ కళాక్షేత్రం నిర్మాణ పనులు ఇంకా ఏమైనా మిగిలి ఉంటే వెంటనే పూర్తి చేయాలని, వచ్చే నెల 2న సీఎం పర్యటన ఉంటుందని, ఆ రోజు ప్రారంభించుకోవచ్చని సూచించారు. వరంగల్‌లో విమానాశ్రయానికి సంబంధించిన వివిధ అంశాలపై ఆర్ అండ్‌బీ మంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. వరంగల్ నగరాభివృద్ధి పై అడిగిన ప్రశ్నలకు మునిసిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే సరిగా సమాధానాలు చెప్పకపోవడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. సిటీప్లానర్‌ను కూడా పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు.

నిజమైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపు విషయంలో తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, తప్పకుండా త్వరలో ఇళ్లస్థలాలు ఇస్తామని మంత్రి పొంగులేటి హామీ ఇచ్చారు. గత ప్రభుత్వం పాత్రికేయుల ఇళ్ల స్థలాల విషయంలో కాయాపన చేసిందని, అర్హుల జాబితాను జర్నలిస్ట్ యూనియన్‌ల కమిటీలు అందిస్తే ఇంటి స్థలాలను కేటాయించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ఇంటి స్థలాల విషయంలో యూనియన్‌ల నాయకులు రాష్ట్ర ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డితో చర్చించాలని సూచించారు.

మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. వరంగల్‌పై సీఎం ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారని, అధికారులు నగరాభివృద్ధికి సమష్టిగా కృషి చేయాలన్నారు. ఇంతకు ముందు సీఎం వరంగల్ పర్యటనపు వచ్చినప్పుడు డంపింగ్ యార్డు సమస్య ప్రస్తావనకు వచ్చిందని, ఆ సమస్యకు శాశ్వత పరిష్కారం జరగాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, ఎంపీ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, కుడా చైర్మన్ వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, అదనపు కలెక్టర్‌లు వెంకట్‌రెడ్డి, సంధ్యారాణి పాల్గొన్నారు.

తల్లి అనారోగ్యం తట్టులోలేక..

అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆత్మహత్య



విజ్ఞాన్(ఫైల్)

గిర్మాజిపేట,సెప్టెంబర్ 17 : తల్లి ఆరోగ్యం క్షీణించడం తో ఆందోళన చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న కుమారుడు గాదె విజ్ఞాన్ (32) రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన సోమవారం రాత్రి వరంగల్-చింతల్‌పల్లి రైల్వేస్టేషన్‌ల మధ్య జరిగింది. వరంగల్ జీఆర్‌పీ సీఐ పి.సురేందర్ మంగళవారం విలేకరులకు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. గీసుగొండ మండలం ధర్మారానికి చెందిన గాదె విజ్ఞాన్ ఎంటెక్ పూర్తి చేసి కేయూ ఇంజనీరింగ్ కళాశాలలో కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నాడు. వారం రోజుల క్రితం తల్లి శోభారాణి (62) డెంగీతో ప్లేట్‌లెట్స్ తగ్గిపోయాయి. తల్లికి ఏమైనా జరిగితే తన పరిస్థితి ఎంటనే మానసికంగా బాధపడుతూ విజ్ఞాన్ రెండు రోజులూ ముభావంగా ఉంటునానడు. సోమవారం రాత్రి ఇంటి నుంచి బయటకు వచ్చిన విజ్ఞాన్ ధర్మారం రైల్వేగే టు వద్ద రాత్రి సికింద్రాబాద్ నుంచి విశాఖపట్టణం వెళ్తున్న గోదావరి ఎక్స్‌ప్రెస్ కిందపడి ఆత్మహత్య చేసు కున్నాడు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని తండ్రి గాదె పాణికి అప్పగించి హెడ్‌కానిస్టేబుల్ పి.రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రెండో రోజూ నిమజ్జనాలు

- చిన్నవడ్డెపల్లి చెరువు వద్ద సందడి

పోచమ్మమైదాన్, సెప్టెంబరు 17: వరంగల్ దేశాయిపేటలోని చిన్న వడ్డెపల్లి చెరువులో వినాయక నిమజ్జన వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి. సోమవారం ప్రారంభమైన నిమజ్జన వేడుకలు మంగళవారం వరకు కొనసాగాయి. గణేష్ ఉత్సవ నిర్వాహకులు ఆలస్యంగా రోడ్లపైకి వచ్చారు. దాంతో అర్ధరాత్రి వరకు నిమజ్జనం నెమ్మదిగా సాగింది. అర్ధరాత్రి 1 గంట వరకు చిన్నవడ్డెపల్లి చెరువులో సుమారుగా 500 లోపు విగ్రహాలు మాత్రమే నిమజ్జమయ్యాయి. ఆ తర్వాత ఊపందుకుంది. మంగళవారం ఉదయం సుమారు 11గంటల వరకు నిమజ్జనం నిర్విరామంగా సాగింది.

కొరవడిన అధికారుల పర్యవేక్షణ....

నిమజ్జన వేడుకల్లో అధికారుల పర్యవేక్షణ కొరవడింది. అర్ధరాత్రి దాటాక రెవెన్యూ, మునిసిపల్ అధికారులు కనబడకపోవడంతో సిబ్బంది చేతుల మీదుగానే నిమజ్జన ప్రక్రియ కొనసాగినట్లు భక్తులు పేర్కొటున్నారు. తెల్లవారుజాము నుంచి అధిక శాతం విగ్రహాలు నిమజ్జనానికి రావడంతో కొంత ఇబ్బందికర పరిస్థితులు తలెత్తాయి. కేవలం పోలీసు సిబ్బంది మాత్రమే విధుల్లో ఉండటంతో నిమజ్జనం చేసే క్రేన్‌ల వద్ద విగ్రహాలు భారీగా మోహరించారు. అధికారులు పర్యవే క్షణ లేకపోవడంతో గణపతి మండపాల నిర్వాహకుల వద్ద డబ్బులు డిమాండ్ చే స్తున్నారని పలువురు భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ క్రేన్‌ల వద్ద నిమజ్జనం చేసే వారితో వాగ్వాదానికి దిగారు. ఉదయం పది తరువాత ఒక్కో విగ్రహానికి రూ. వెయ్యి ఇస్తేనే నిమజ్జనం చేస్తామని బాహాటంగానే డబ్బులు వసూలు చేసినట్లు తెలుస్తోంది. పోలీసులు కనీసం పట్టించుకోలేదని ఆరోపణలు వెలువడుతున్నాయి.

చిన్నవడ్డెపల్లి చెరువు వద్ద బారులుదీరిన వినాయక విగ్రహాలు



చెరువు చుట్టూ.. అవినీతి ఉచ్చు..

- గత ప్రభుత్వం హయాంలో రూ.13.62కోట్లతో కట్టకు శాశ్వత మరమ్మతులు
- పనుల్లో అక్రమాలు జరిగాయంటూ సీఎంకు ఎమ్మెల్యే లేఖ
- విచారణ జరిపి నిజాలు తేల్చాలని వినతి
- కోనారెడ్డి చెరువు కట్ట భద్రతపై రైతుల ఆందోళన

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 17: వర్ధన్నపేట నియోజకవర్గంలోని అతిపెద్ద చెరువైన వర్ధన్నపేటలలోని కోనారెడ్డి చెరువు కట్ట చుట్టూ రాజకీయం వేడెక్కుతోంది. గత ప్రభుత్వం చేపట్టి కట్ట శాశ్వత మరమ్మతు పనుల్లో అవినీతి జరిగిందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ప్రభుత్వానికి ఫిర్యాదు చేయడం హాట్ టాపిక్‌గా మారింది. కట్ట పనుల్లో అవినీతి జరిగిందని, దీనికి ఉన్నతాధికారుల నుంచి కింది స్థాయి అధికారుల వరకు హస్తం ఉందనేది కాంగ్రెస్ వాదన. 2020 ఆగస్టు 20న కోనారెడ్డి చెరువుకు గండి పడి వందమీటర్ల మేరకు కట్ట కోతకు గురై వందలాది ఎకరాల పంట పొలాలు నీటమునిగాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో చెరువు కు గండి రాజకీయ అస్త్రంగా మారింది.

నాణ్యత, నాసిరకం పనులంటూ...

గత పాలకులు చెరువు పేరిట అక్రమాలకు పాల్పడ్డారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మిషన్ కాకతీయ పేరిట రూ.2.68కోట్లతో 2018లో పనులు చేపట్టారు. కొంత మట్టిని పొలాలకు తరలించగా, మిగతా మట్టిని చెరువు కట్ట పైనే పోశారు. కట్ట రెండేళ్లకే గండి పడి, తెగిపోయింది. దీంతో పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.13.62 కోట్లు కేటాయించి కట్టకు శాశ్వత మరమ్మతు పనులు చేసింది. ప్రస్తుతం పనులన్నీ తుది దశకు చేరుకున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు కట్ట తెగే ప్రమాదం ఏర్పడిందనే ప్రచారం సాగింది. కొన్ని చోట్ల లీకేజీలను గుర్తించి ఇసుక బస్తాలతో పూడ్చారు. దీంతో చెరువు శాశ్వత మరమ్మతు పనుల్లో నాణ్యత లోపాలు, నాసిరకం పనులే కారణమంటూ వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ఆరోపిస్తున్నారు. పనుల్లో అక్రమాలు జరిగాయని, దీనిపై విచారణ చేసి నిజాలను నిగ్గు తేల్చాలని సీఎంను కోరారు.



2020లో చెరువుకు గండి పడి కట్ట తెగిపోయిన దృశ్యం(ఫైల్)

కబ్జాకు గురైన మత్తడి..

మత్తడి కబ్జాకు గురైందని, మత్తడి పక్కనే పొలాలు పండించడంపై స్థానికులు ఇటీవల కోనారెడ్డి సందర్శనకు వచ్చిన ఎమ్మెల్యే నాగరాజు ఎదుట వాపోయారు. గతంలో 240మీటర్లు ఉండే మత్తడి 50మీటర్లకు కుచించుకుపోవడంపై ప్రశ్నించారు. నీటి సామర్థ్యం పెరుగుతుండడంతో అధికారులు మత్తడి గండి పెట్టి నీటిని మళ్లించారు. తర్వాత కట్టకు రింగ్ బండ్ నిర్మాణం చేసినప్పుడు మత్తడికి సైతం మరమ్మతు పనులు చేశారు. దాదాపు 110మీటర్ల వరకు మత్తడికి నీరు అలుగు పోసేలా ప్లాట్‌ఫాంను నిర్మించారు. అక్కడి వరకే కట్టకు రాళ్ల సైతం నిర్మించి ఉన్నాయి. అక్కడి నుంచి మరో 120 మీటర్ల వరకు మత్తడి రాళ్లు ఉన్నాయి. వీటిని బైవాష్ కోసం (మత్తడి పోసినప్పుడు పక్కల నుంచి నీరు వెళ్లి భూమి కోతకు గురి కాకుండా) నిర్మించినట్లు అధికారులు చెపుతున్నారు.

నియోజకవర్గంలోనే పెద్ద చెరువు...

వర్ధన్నపేట నియోజకవర్గంలోనే కోనారెడ్డి చెరువు అతి పెద్దది. దాదాపు 600 ఎకరాల విస్తీర్ణంతో ఉన్న కోనారెడ్డి చెరువు పూర్తిగా నిండితే మరో 500 ఎకరాల వరకు పొలాలు నీటిలో మునిగిపోతాయి. దమ్మన్నపేట, దివిటిపెల్లి, ఒగులాపురం, జఫర్‌ఘడ్ ఇలా మీది నుంచి వచ్చే నీరంతా కోనారెడ్డి చెరువులోకి వచ్చే చేరుతుంది. ఇటు కోనాయిచలం ఫీడర్ ఛానల్ నుంచి సైతం కట్టు కాలువ ద్వారా చెరువులోకి వరద వస్తుంది. కోనారెడ్డి మత్తడి పడితే ఆ నీరంతా ఆకేరు వాగులో కలుస్తుంది.




వర్ధన్నపేటలోని కోనారెడ్డి చెరువు

నిగ్గు తేల్చాల్సింది అధికారులే...

ఇటీవల మళ్లీ కోనారెడ్డి చెరువుకు గండి పడే అవకాశం ఉందని పలువురు రైతులు చెప్పడంతో ప్రజలు మరోసారి భయాందోళనకు గురయ్యారు. పోలీసులు, ఇరిగేషన్ అధికారులు అప్రమత్తమై చెరువును సందర్శించి అనుమానం ఉన్న చోట్ల మరమ్మతు చేశారు. దీంతో గతంలో కోట్లాది రూపాయలతో పనులు చేస్తే ఎందుకీ దుస్థితి వచ్చిందని కాంగ్రెస్ ప్రశ్నిస్తోంది. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే నాగరాజు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాయడం ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది.

విచారణ చేయాలని ఫిర్యాదు చేశా..

- కేఆర్ నాగరాజు, వర్ధన్నపేట ఎమ్మెల్యే



కోనారెడ్డి చెరువు కట్ట శాశ్వత మరమ్మతు పనుల పేరిట గత ప్రభుత్వం అవినీతికి పాల్పడింది. వాటి పై సమగ్ర విచారణ చేయాలని స్వయంగా నేనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఫిర్యాదు చేశాను. దాని పై విజిలెన్స్ విచారణ జరిగే అవకాశం ఉంది. రూ. 13.62 కోట్ల పనుల్లో భారీ అవినీతి జరిగింది. అందుకే కోనారెడ్డి చెరువు కట్ట నాసిరకంగా ఉంది. పనుల్లో నాణ్యత కనిపించడం లేదు. అప్పటి నీటిపారుదల శాఖ అధికారులు సైతం ఇందులో ముఖ్య పాత్ర పోషించారు. వీరి పై త్వరలోనే ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకుంటుందని విశ్వసిస్తున్నా..

ఆదివాసీ పిల్లలకు మెరుగైన విద్య

- రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క
- బంగారుపల్లిలో కంటెయినర్ పాఠశాల ప్రారంభం



జ్యోతిప్రజ్వలన చేస్తున్న సీతక్క, ఎంపీ బలరాం, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

కన్నాయిగూడెం, సెప్టెంబరు 17: ఆదివాసీ చిన్నారులకు మెరుగైన విద్యనందించి, వారిని ఉన్నతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా రాష్ట్రప్రభుత్వం పలు వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుడుతోందని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్క పేర్కొన్నారు. ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని కంతనపల్లి గ్రామ పంచాయతీ పరిధి గొత్తికోయ గూడేమైన బంగారుపల్లిలో రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా ఏర్పాటు చేసిన కంటెయినర్ పాఠశాలను మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్‌తో కలిసి ఆమె మంగళవారం ప్రారంభించారు. తొలుత మంత్రి సీతక్కకు గొత్తికోయలు సంప్రదాయ పద్ధతిలో ఘన స్వాగతం పలికారు. ఆ తర్వాత కంటెయినర్ పాఠశాలను ప్రారంభించిన సీతక్క విద్యార్థులకు పాఠాలు బోధించారు.

ఈ సందర్భంగా ఆమె మట్లాడుతూ.. ఆదివాసీ పిల్లలకు మెరుగైన విద్యనందించే లక్ష్యంతో పనిచేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా బంగారుపల్లిలో రూ.13.50లక్షలతో కంటెయినర్ పాఠశాలను ఏర్పాటు చేసిందన్నారు. బడులకు భవనాలను నిర్మించుకునేందుకు అటవీ శాఖ అనుమతులు ఇవ్వకపోతుండటం వల్ల ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రభుత్వ పాఠశాలలను నిర్మించలేకపోతున్నామని, ఈ క్రమంలోనే బంగారుపల్లిలో కంటెయినర్ పాఠశాలను ఏర్పాటు చేశామన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని కంటైనర్ పాఠశాలలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. గత ప్రభుత్వ విధానాల వల్ల గడిచిన పదేళ్ల కాలంలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని, వందలాది పాఠశాలలు మూత పడ్డాయని విమర్శించారు. గాడి తప్పిన విద్యావ్యవస్థను ప్రక్షాళన చేసేందుకు రేవంత్ నేతృత్వంలో తమ సర్కారు విశేష కృషి చేస్తోందన్నారు. ఎన్నికల హామీ మేరకు సంక్షేమ పథకాలన్నీ అమలు చేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, ములుగు కలెక్టర్ దివాకర, ఓఎస్డీ మహేష్‌బాబా సాహెబ్ గీతె, ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, ఆర్డీవో కె.సత్యపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న మంత్రి సీతక్క

ఆల్ ఇండియా కన్స్యూమర్ వెల్ఫేర్ కౌన్సిల్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా దామోదర్



కాళోజీ జంక్షన్, సెప్టెంబరు 17: ఆల్ ఇండియా కన్స్యూమర్ వెల్ఫేర్ కౌన్సిల్ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా హనుమకొండకు చెందిన సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ కార్యదర్శి డాక్టర్ పల్లెపాడు దామోదర్ నియమితులయ్యారు. బుధవారం ఢిల్లీలో జరిగిన సమావేశంలో సంస్థ జాతీయ అధ్యక్షుడు అనంత్‌శర్మ దామోదర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దక్షిణాది రాష్ట్రాల వినియోగదారుల సమన్వయ సమితి అధ్యక్షుడిగా పని చేస్తున్న దామోదర్‌ను కన్స్యూమర్ కాన్ఫిడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ సీనియర్ సెక్రటరీగా కూడా బాధ్యతలు అప్పగించారు. 30 ఏళ్లుగా దామోదర్ అనేక సామాజిక సేవా కార్యక్రమాలు, వినియోగదారుల చైతన్య సదస్సులు, ఆహార పదార్థాల కల్తీ నియంత్రణకు, టెస్ట్ చెక్‌లు, తూనికలు, కొలతల మోసాల్లో వినియోగదారులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తూ అనేక అవార్డులు, ప్రశంసా పత్రాలు పొందారు.

కేయూ ప్రీ పీహెచ్‌డీ పరీక్ష ఫీజు గడువు 1

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 17: కాకతీయ యూనివర్సిటీ ఫార్మసీ, ఇంజనీరింగ్, లా, సోషల్‌సైన్స్, ఆర్ట్స్, సైన్స్, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్, ఎడ్యుకేషన్‌తో పాటు అన్ని విభాగాల్లో పీహెచ్‌డీ మొదటి దఫా లిస్టులో 2021-22 ఏడాదికి అడ్మిషన్లు పొందిన అభ్యర్థులందరూ అక్టోబరు 1 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా ప్రీ పీహెచ్‌డీ పరీక్షల ఫీజులు చెల్లించుకోవాలని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి పీఎస్ఎల్ సౌజన్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.250అపరాధ రుసుంతో అక్టోబరు 15 వరకు ఫీజులు చెల్లించుకోవాలని వివరించారు. ధృవపత్రాలు, ఇతర పీహెచ్‌డీ అడ్మిషన్ల జాయినింగ్ రిపోర్టులతో ఫీజులు చెల్లించుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు వర్సిటీ వెబ్‌సైట్‌లో చూడాలని స్పష్టం చేశారు.

పీహెచ్‌డీ ఇంటర్వ్యూలను మళ్లీ నిర్వహించాలి

రిజిస్ట్రార్ చాంబర్‌లో ఆశావహుల నిరాహార దీక్షలు



కేయూ క్యాంపస్, సెప్టెంబరు 17: కాకతీయ యూనివర్సిటీ పీహెచ్‌డీ అడ్మిషన్ల కోసం ఇంటర్వ్యూలు మళ్లీ నిర్వహించి ఆశావహులకు న్యాయం చేయాలని విద్యార్థులు రిజిస్ట్రార్ చాంబర్‌లో నిరసన దీక్షలు చేపట్టారు. మంగళవారం కేయూ రిజిస్ట్రార్ చాంబర్‌లో ఏబీఎస్ఎఫ్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు మంద నరేశ్ నేతృత్వంలో నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా మంద నరేశ్ మాట్లాడుతూ.. ఆరోగ్య, కుటుంబ సమస్యలతో కేయూలో జరిగిన పీహెచ్‌డీ ఇంటర్వ్యూలకు హాజరు కాని అభ్యర్థులకు మళ్లీ ఇంటర్వ్యూలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఇంటర్వ్యూల్లో మెరిట్ ఆధారంగానే పీహెచ్‌డీ సీట్లను కేటాయించి న్యాయం చేయాలని అన్నారు. ఇంటర్వ్యూలకు రాని అభ్యర్థులకు పీహెచ్‌డీ అడ్మిషన్లు రాకపోవడంతో అభ్యర్థులు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంటర్వ్యూలు మళ్లీ నిర్వహించిన అందరికీ న్యాయం చేయాలని వర్సిటీ అధికారులను డిమాండ్ చేశారు. కాగా, మంద నరేశ్ చేపట్టిన దీక్షల వద్దకు రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి, సోషల్ సైన్స్ డీన్ మనోహర్, పరీక్షల నియంత్రణాధికారి శ్రీ రామోజు నరసింహచారి తదితరులు వచ్చి చర్చలు జరిపారు. ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణతో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో దీక్షలు విరమించారు. ఈ దీక్షల్లో పీహెచ్‌డీ ఆశావాహులు, పరిశోధకులు పాల్గొన్నారు.



కేఎంసీలోని అంతర్గత రహదారుల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రులు, తదితరులు

ఎంజీఎంలో అందుబాటులోకి ప్లేట్‌లెట్ యంత్రం

● ప్రారంభించిన మంత్రులు పొంగులేటి, సురేఖ ● ఎంజీఎంలో వైద్య సేవలపై ఆరా ● డయాలసిస్ రోగులకు మరో 14 పడకలు

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 17: ఎంజీఎం ఆస్పత్రిలో రూ.41లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన సింగిల్‌డోనర్ ప్లేట్‌లెట్ కౌంట్ మెషిన్‌ను రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర అటవీ శాఖ మంత్రి కొండా సురేఖతో కలిసి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రులు ఆస్పత్రిలోని పలు విభాగాలైన ఔట్ పేషంట్, ఆరోగ్యశ్రీవార్డు, క్యాజువాలిటీ విభాగాలను సందర్శించి రోగులతో నేరుగా మాట్లాడి అందిస్తున్న సేవలపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. వంటశాలను సందర్శించి రోగుల కోసం తయారు చేస్తున్న భోజనాన్ని పరిశీలించారు.

ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. ప్రాణాంతకమైన డెంగీ వ్యాధి వల్ల రక్తంలో ప్లేట్‌లెట్లు తగ్గుతాయని, ఎస్‌డీపీ మెషిన్ ఏర్పాటుతో ఈ సమస్య తీరుతుందన్నారు. సింగిల్ డోనర్ ప్లేట్‌లెట్ సేకరించేందుకు ప్రయివేట్ ఆస్పత్రిలో రూ.12వేలు ఖర్చు చేయాల్సి ఉంటుందని, కానీ ఎంజీఎం ఆస్పత్రిలో ఉచితంగా వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం కాకతీయ మెడికల్ కళాశాల ఆవరణలోని పీఎంఎస్ఎస్‌వై ఆస్పత్రిలో 14పడకలకు అప్‌గ్రేడ్ చేసి డయాలసిస్ సెంటరును మంత్రులు ప్రారంభించారు. అదనంగా 10 డయాలసిస్ పడకల యూనిట్లను మంజూరు చేస్తున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

ఈ సందర్భంగా కాకతీయ మెడికల్ కళాశాలలో రూ.3.45కోట్ల వ్యయంతో నిర్మించే అంతర్గత రోడ్ల పనులను మంత్రులు ప్రారంభించారు. అనంతరం పీడియాట్రిక్ సర్జరీ విభాగంలో పిల్లల తల్లిదండ్రులకు కల్పిస్తున్న వైద్యం గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్‌రెడ్డి, కేఆర్.నాగరాజు, కలెక్టర్ డాక్టర్ సత్యశారద, మునిసిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, కార్పొరేటర్ వేముల శ్రీనివాస్, ఎంజీఎం సూపరింటెండెంట్ డాక్టర్ మురళి, ఆర్ఎంవోలు మురళి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసీ విభాగాన్ని తనిఖీ చేసిన ఎంపీ కావ్య



తనిఖీ చేస్తున్న ఎంపీ కావ్య

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 17: వరంగల్ ఎంజీఎంలోని ఫార్మసీ విభాగాన్ని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. మంగళవారం పలు అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కొండా సురేఖతో కలిసి ఎంజీఎం ఆస్పత్రికి చేరుకున్నారు. అక్కడ ఓ రోగి బంధువు తనకు మందులు ఇవ్వడం లేదన్న విషయాన్ని మంత్రులు, ఎంపీ దృష్టికి తీసుకొచ్చాడు. వెంటనే స్పందించిన ఎంపీ కడియం కావ్య రోగిని తీసుకొని నేరుగా ఎంజీఎం ఆస్పత్రిలోని ఫార్మసీ కేంద్రానికి చేరుకొని పేషెంట్లకు ఇస్తున్న మందులను పరిశీలించారు. స్టాక్ వివరాలను, రిజిస్టర్‌ను పరిశీలించారు. సుమారు మూడు నెలలుగా మెడిసిన్స్ అందుబాటులో లేకపోయినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న ఫార్మసీ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంజీఎంలో కనీసం పెయిన్ కిల్లర్స్ కూడా అందుబాటులో లేకపోవడం ఏమిటని ఎంపీ ప్రశ్నించారు. మరోసారి ఇలాంటి తప్పులు పునరావృతం అయితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ విషయాన్ని మంత్రుల దృష్టికి తీసుకెళ్లారు. వైద్యాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు

ఎంజీఎం అధికారులతో వరంగల్ కలెక్టర్ సమీక్ష

వరంగల్ మెడికల్, సెప్టెంబరు 17: ఎంజీఎం ఆస్పత్రిలోని అన్ని విభాగాల అధిపతులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్యశారద మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఆస్పత్రి అభివృద్ధికి అవసరమైన సలహాలు, సూచనలు చేశారు. ఎంజీఎంలోని డెర్మటాలజీ విభాగాన్ని పీఎంఎస్ఎస్‌వై సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, కేఎంసీ హనుమకొండలోకి మార్చాలని ఆదేశించారు. ఎంజీఎం ఫార్మసీ, స్టోర్ విభానికి సంబంధించిన వివరాలు తీసుకొని సంబంధిత అధికారులతో బుధవారం కలెక్టరేట్‌కు రావాలని ఆదేశించారు. ఆస్పత్రి ఆవరణలో నిర్వహిస్తున్న షాపుల అనుమతుల గురించి వివరాలు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు.



అక్టోబరు 2వరకు 'స్వచ్ఛతా హి'

షెడ్యూల్ ప్రకటించిన కేంద్ర ప్రభుత్వం

కాశిబుగ్గ, సెప్టెంబరు 17: స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛతా హి సేవా -24 కార్యక్రమాల నిర్వహణకు కేంద్రం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా మంగళవారం నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు చేపట్టాల్సిన ప్రచార, పారిశుధ్య కార్యక్రమాల వివరాలను అధికారులు ప్రకటించారు. 'స్వభావ్ స్వచ్ఛత, సంస్కార్ స్వచ్ఛత'ను 2024 థీమ్‌గా ప్రకటించారు. గ్రామాల్లో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు, అవగాహన, పాఠశాలలు, అంగన్‌వాడీ తదితర కేంద్రాల్లో శ్రమదానం, ఇంటింటికి దోమల నివారణ చర్యలు చేపట్టనున్నారు. అలాగే మరుగుదొడ్ల నిర్మాణాలు ప్రారంభం, యువతకు క్రీడాకార్యక్రమాలు, తాగునీటి ట్యాంకుల క్లోరినేషన్, స్వచ్ఛ సాంస్కృతిక కార్యక్రమాలు, మురుగు కాల్వల్లో చెత్త తొలగింపు, ఇంకుడు గుంతల నిర్మాణం, తడి, పొడిచెత్తపై అవగాహన కల్పించనున్నారు. గ్రామసభలు, వైద్య పరీక్షల నిర్వహణ, పారిశుధ్య అవగాహన ప్రదర్శనలు, పారిశుధ్య సిబ్బందికి సన్మానం, స్వచ్ఛత ప్రతిజ్ఞ, బహుమతుల ప్రదానోత్సవం జరగనుంది.

రోజువారీ కార్యక్రమాలిలా..

- 17న మానవహారాలు, ప్రతిజ్ఞ, చెత్త సేకరణ డబ్బాల ఏర్పాటు.
- 18న వివిధ వర్గాల భాగస్వామ్యంతో సామూహిక పారిశుధ్య కార్యక్రమం
- 19, 20న మొక్కలు నాటడం, ప్రతీ ఇంట అవగాహన, నీటి వనరుల శుద్ధీకరణ
- 21, 22, 23న మొక్కలు నాటడం, ఇంటింటి ప్రచారం, విద్యార్థులతో మానవహారాలు, వ్యర్థాల తొలగింపు.
- 24న ప్రత్యేక పారిశుధ్య పనులు
- 25న ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయ సంచుల వాడకంపై ప్రచారం.
- 26న స్వచ్ఛ ఆహార వినియోగంపై కళా ప్రదర్శనలు
- 27న యాత్ర, పర్యాటక స్థలాల్లో పారిశుధ్య పనులు, పోటీల నిర్వహణ
- 28న సఫాయి కార్మికుల సంక్షేమ కార్యక్రమాలు
- 29న సఫాయి మిత్ర సురక్ష శిబిరం, వైద్య, ఆరోగ్య పరీక్షల నిర్వహణ.
- 30న స్వచ్ఛతపై ప్రతిన, మానవహారాల ఏర్పాటు, మొక్కలు నాటడం, కంపోస్ట్ యూనిట్ల ఏర్పాటు.
- అక్టోబరు 1న సంపూర్ణ స్వచ్ఛత పట్టణంగా ప్రకటన.
- 2న గాంధీ జయంతిని పురస్కరించుకొని స్వచ్ఛభారత్ దివస్ నిర్వహణ. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంతో మారిన ప్రదేశాల గుర్తింపు. కార్మికులకు సత్కారం.

తొడేళ్లగూడెంలో యువతి ఆత్మహత్య



కల్యాణి (ఫైల్)

డోర్నకల్, సెప్టెంబరు 17: అనారోగ్యంతో బాధపడుతూ మనస్తాపం చెందిన ఓ యువతి ఎలుకల మందుతాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన తొడేళ్లగూడెంలో మంగళవారం చోటు చేసుకుంది. ఏఎస్సై కోటేశ్వర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం. తొడేళ్లగూడెం గ్రామానికి చెందిన పిట్టల ఉపేందర్ కుమార్తె కల్యాణి (21) డిగ్రీ వరకు విద్యనభ్యసించింది. అనారోగ్యం కారణంగా పెళ్లి సంబంధాలు కుదరకపోవడంతో మనస్తాపం చెందిన కల్యాణి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఈనెల 15న ఎలుకల మందు తాగింది. కొంతసేపటి తర్వాత ఇంటికి వచ్చిన కుటుంబసభ్యులకు మందు వాసన రావడంతో వెంటనే కల్యాణిని ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. కల్యాణి తండ్రి ఉపేందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.



వర్సిటీ ఎదుట నిరసన తెలుపుతున్న పీడీఎస్‌యూ నేతలు వెంకట్‌రెడ్డి, తదితరులు

సెప్టెంబరు 17 తెలంగాణ విద్రోహ దినమే..

పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిళి వెంకట్‌రెడ్డి

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 17: సెప్టెంబరు 17 తెలంగాణ విద్రోహ దినమేనని పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు మొగిళి వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం కేయూ మొదటి గేటు ఎదుట పీడీఎస్‌యూ వర్సిటీ కార్యవర్గం ఆధ్వర్యంలో సెప్టెంబరు 17 విద్రోహ దినాన్ని పాటిస్తూ నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మొగిళి వెంకట్‌రెడ్డి హాజరై మాట్లాడారు. 1948 సెప్టెంబరు 17ను విలీన దినమని, విమోచన దినమని పిలుస్తూ చరిత్రను వక్రీకరిస్తున్నారని చెప్పారు. నిజాంకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో కమ్యూనిస్టులు ప్రాణాలు కోల్పోయాని గుర్తు చేశారు. సెప్టెంబరు 17 విద్రోహ దినమేనని స్పష్టం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి విద్యారంగాన్ని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. వర్సిటీలకు వీసీలను నియమించాలని అన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత నాలుగు వర్సిటీలకు నూతనంగా అనుమతులను ఇచ్చి విద్యను ప్రైవేట్‌పరంగా చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నేతలు రాచకొండ రంజిత్, మర్రి మహేశ్, అర్జున్, జీవన్, రాజ్‌కుమార్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

డీఎస్‌యూ నేతృత్వంలో..

డెమోక్రటిక్ స్టూడెంట్ ఫెడరేషన్ (డీఎస్‌యూ) నేతృత్వంలో మంగళవారం కేయూ మొదటి గేటు ఎదుట మంగళవారం తెలంగాణ విద్రోహ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో డీఎస్‌యూ రాష్ట్ర కన్వీనర్లు శ్రావణ్, గణేశ్‌లు హాజరై మాట్లాడారు. సెప్టెంబరు 17 ముమ్మాటికీ తెలంగాణ విద్రోహ దినమేని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌యూ హనుమకొండ కన్వీనర్ ఉప్పుల శివ, నాయకులు శరత్, నరేందర్, మహేశ్, చరణ్, అశోక్, దేవేందర్, రక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల్లో సమస్యలు పరిష్కరించాలి

తెలంగాణ గురుకుల డిగ్రీ కళాశాల సాధికారత సంఘం ఆధ్వర్యంలో నిరసన



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న మహిళ గురుకుల అధ్యాపకులు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 17: తెలంగాణ గురుకుల డిగ్రీ కళాశాల సాధికారత సంఘం (టీఆర్‌డీఈసీఏ) ఆధ్వర్యంలో మహిళ అధ్యాపకులు మంగళవారం శాంతియుత నిరసన దర్నా చేపట్టారు. ఐదు సొసైటీల నేతృత్వంలో నిర్వహిస్తున్న గురుకులాల్లో సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా టీఆర్‌డీఈసీఏ అధ్యక్షురాలు డాక్టర్ టి. సాంబలక్ష్మి మాట్లాడుతూ.. గురుకుల కాలపట్టికలో శాస్త్రీయత అవసరమని చెప్పారు. గురుకుల కళాశాలలు ఉదయం 9.30 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్వహించాలని డిమాండ్ చేశారు. అద్దె భవనాల్లో నిర్వహిస్తున్న గురుకుల కళాశాలల్లో విద్యార్థులకు సరైన సదుపాయాలు లేవని చెప్పారు. తమకు యూజీసీ పే స్కేల్ ఇప్పించాలని, నైట్ స్టే డ్యూటీల నుంచి మినహాయింపు ఇవ్వాలని, 010 పద్దుతో జీతాలు ఇప్పించడంతో పాటు ఆరోగ్య కార్డులను అందచేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పద్మ, ప్రతిభ, తదితరులు పాల్గొన్నారు.

మట్కా నిర్వాహకురాలి అరెస్టు

రూ.24వేల నగదు స్వాధీనం

వరంగల్ క్రైం, సెప్టెంబరు 17: వరంగల్ మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్ పరిధిలోని క్రిష్టియన్ కాలనీలో మట్కా నిర్వాహకురాలిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో క్రిష్టియన్ కాలనీకి చెందిన జి.శ్రీలత నిరుపేదలకు ఆశలు చూపించి మట్కా నిర్వహిస్తోంది. సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ సీఐ కె.శ్రీధర్ మంగళవారం తన సిబ్బందితో వెళ్లి దాడి చేశారు. రూ.24వేల నగదు స్వాధీనం చేసుకుని శ్రీలతను అరెస్టు చేశారు. అరెస్టు చేసిన శ్రీలతను విచారణ నిమిత్తం మిల్స్‌కాలనీ పోలీసులకు అప్పగించారు.

విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి



జాతీయ జెండా ఎగరవేస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి

బాలసముద్రం, సెప్టెంబరు 17: సెప్టెంబరు 17న తెలంగాణ విలీన దినోత్సవాన్ని రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా స్వాతంత్ర్య దినోత్సవంగా నిర్వహించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. మంగళవారం పార్టీ జిల్లా కార్యాలయంలో సెప్టెంబరు 17 తెలంగాణ విలీన దినోత్సవం సందర్భంగా జాతీయ జెండాను భిక్షపతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను పాఠ్యాంశాల్లో చేర్చి నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉందన్నారు. 4,500 మంది కమ్యూనిస్టు కార్యకర్తలు తెలంగాణ సాయుధ పోరాటంలో రక్తాన్ని చిందించి నేలకొరిగిన చరిత్ర ప్రజలకు తెలుసన్నారు. పోరాటంలో అమరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకొని ప్రజా సమస్యలపై ఉద్యమించాల్సిన అవసరం ఉందని భిక్షపతి కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి నెదునూరి జ్యోతి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, మండ సదాలక్ష్మి, అశోక్, స్టాలిన్, తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, మునిగాల భిక్షపతి, కొట్టెపాక రవి, వెంకటరమణ, మెట్టు శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పోరాటంపై అసత్య ప్రచారాన్ని తిప్పికొట్టాలి

● ఐనవోలు: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్రపై బీజేపీ ఆర్ఎస్ఎస్ చేస్తున్న అసత్య అబద్ధ ప్రచారాలను తిప్పికొట్టాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి పిలుపునిచ్చారు. ఐనవోలులో మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ.. భూమి, భుక్తి, వెట్టిచాకిరి నుంచి విముక్తి కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో 4,500 మంది కమ్యూనిస్టులు నెలకొరిగి, 3,500 గ్రామాలను విముక్తి చేసి నైజాం మెడలు వంచి 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచారన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ సైనిక చర్యద్వారా తెలంగాణకు విముక్తి జరగలేదన్నారు. తెలంగాణ సాయుధ పోరాటానికి ఎలాంటి సంబంధం లేని బీజేపీ, ఆర్ఎస్ఎస్ హిందూ ముస్లిం మధ్య యుద్ధం జరిగిందనే అసత్యాన్ని ప్రచారం చేయడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. ఎందరో బలిదానాలతో తెలంగాణ ప్రాంతానికి విముక్తి లభించిందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొని పింఛన్ కోసం దరఖాస్తు చేసుకుంటే కేంద్రంలోని ఎన్డీఏ, బీజేపీ ప్రభుత్వాలు తిరస్కరించడం ద్వంద్వనీతికి నిదర్శనమన్నారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు తోట భిక్షపతి, మద్దెల ఎల్లేష్, రాష్ట్ర నాయకులు ఆదరి శ్రీనివాస్, నద్దునూరి అశోక్, స్టాలిన్, జిల్లా నాయకులు మునిగాల భిక్షపతి, మంద సుమన్, ఐలయ్య తదితరులు పాల్గొన్నారు.



ఐజాక్ ప్రభాకర్‌ను సన్మానిస్తున్న లైబ్రరీ ఉద్యోగులు

వర్సిటీ లైబ్రరీ ఇన్‌చార్జ్‌గా ఐజాక్ ప్రభాకర్ బాధ్యతలు

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 17: కాకతీయ యూనివర్సిటీ ప్రధాన లైబ్రరీ ఇన్‌చార్జిగా వీపీ ఐజాక్ ప్రభాకర్‌ను నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉత్తర్వులు అందుకున్న ఐజాక్ ప్రభాకర్ లైబ్రరీలో బాధ్యతలు చేపట్టారు. బాధ్యతలు చేపట్టిన ఐజాక్ ప్రభాకర్‌ను వర్సిటీ లైబరీ ఉద్యోగులు సంఘం నేతల ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛం, శాలువ అందచేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లైబ్రరీ మెంబర్ ఇన్‌చార్జి ప్రొఫెసర్ జి.షమిత, జావీద్, ఉప్పుల రాజు, చంద్రమోహన్ పాల్గొన్నారు.

కేయూ ఎంఈడీ రెండో సెమిస్టర్ పరీక్షలు షురూ..

కేయూ క్యాంపస్, సెప్టెంబరు 17: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో మంగళవారం ఎంఈడీ రెండో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. వర్సిటీ క్యాంపస్‌లో జరిగిన పరీక్షల నిర్వహణ తీరును కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ నాగరాజు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రణధీర్‌రెడ్డిలు పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా జరుగుతున్నాయని వారు తెలిపారు.



ఎంఈడీ పరీక్షలను పరిశీలిస్తున్న కంట్రోలర్ శ్రీరామోజు నరసింహచారి తదితరులు





యోగాలో రంగశాయిపేట యువకుడికి కాంస్యం

శంభునిపేట, సెప్టెంబరు 17 : రాష్ట్ర యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో 11వ రాష్ట్ర స్థాయి యోగాసన చాంపియన్‌షిప్ పోటీల్లో రంగశాయిపేటకు చెందిన అడుప అభినవ నేతాజీ కాంస్య బహుమతి అందుకున్నారు. హైదరాబాద్‌లోని సరూర్ నగర్ ఇండోర్ స్టేడియంలో ఈనెల 14,15 తేదీల్లో నిర్వహించిన పోటీల్లో 16-18 సంవత్సరాల విభాగంలో నేతాజీ సత్తాచాటాడు. మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన బహుమతి ప్రదానోత్సవంలో తెలంగాణ యోగా అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మనో హర్ చేతుల మీదుగా ప్రశంసాపత్రంతోపాటు మెడల్‌ను అందుకున్నారు. హిమాచల్ ప్రదేశ్‌లో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు.



జంక్షన్‌ను ప్రారంభించిన మంత్రులు శ్రీనివాసరెడ్డి, సురేఖ

ఎస్ఎన్ఎం క్లబ్ జంక్షన్ ప్రారంభం

ఆరంభించిన మంత్రులు శ్రీనివాసరెడ్డి, సురేఖ

గిర్మాజిపేట, సెప్టెంబరు 17: వరంగల్ తాత్కాలిక బస్‌స్టేషన్ సమీపంలో కేంద్ర ప్రభుత్వ స్మార్ట్‌సిటీ పథకం కింద రూ.60లక్షలతో కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ, వరంగల్ మహానగర పాలక వరంగల్ నిర్మించిన ఎస్ఎన్ఎం క్లబ్ జంక్షన్‌ను మంగళవారం దేవాదాయశాఖ, అటవీ పర్యావరణ శాఖల మంత్రి కొండా సురేఖతో కలిసి రెవెన్యూ, గృహనిర్మాణ, పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రారంభించారు. వరంగల్ రైల్వే స్టేషన్, ఆర్టీసీ తాత్కాలిక బస్ స్టేషన్, రైల్వేగూడ్స్ షెడ్, భారత్ పెట్రోలియం ప్రాంతీయ డిపోలు, రాంకీ గేటర్ కమ్యూనిటీ ఎన్‌క్లేవ్, నర్సంపేట రోడ్డుతో అనుసంధానం అయ్యే ఈ జంక్షన్ ప్రజలకు బాగా ఉపయోగపడుతుందని మంత్రి శ్రీనివాసరెడ్డి అన్నారు. నూతన బస్ స్టేషన్ నిర్మాణం త్వరగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కార్పొరేటర్ చింతాకుల అనిల్‌కుమార్, టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాష్‌లు మంత్రులు శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖలను కోరారు. కార్యక్రమంలో వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, మేయర్ గుండు సుధారాణి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వర్ధన్నపేట శాసనసభ్యులు కె.ఆర్.నాగరాజు, కలెక్టర్ సత్యశారద, బల్దియా కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, కాంగ్రెస్ నాయకుడు గోపాల నవీన్‌రాజ్, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

భోజన ప్యాకెట్ల పంపిణీ

కాశిబుగ్గ, సెప్టెంబరు 17: తెలంగాణ విమోచన సందర్భంగా తెలంగాణ ప్రజా పరిరక్షణ సమితి, హ్యూమెన్స్ రైట్స్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం పేదలకు భోజన ప్యాకెట్లను అందించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కుమ్మరి లక్ష్మీనారాయణ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దూపాక ప్రభాకర్, సహాయ కార్యదర్శి బరుపట్ల కిశోర్‌బాబు, ఉగ్గుల రవీందర్, బరుపట్ల సతీష్‌లు పాల్గొన్నారు. భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణ విమోచన దినోత్సవాన్ని కాశిబుగ్గలో నిర్వహించారు. ఆ పార్టీ సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్, జాతీయ జెండాను ఎగరవేశారు. కార్యక్రమంలో సిద్దోజు శ్రీనివాస్, ప్రకాష్, లక్ష్మణ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రజా పాలన



కోటలో తెలంగాణ అమరవీరుల స్తూపానికి మంత్రి నివాళి



కలెక్టరేట్‌లో జాతీయజెండాకు వందనం చేస్తున్న కలెక్టర్, అధికారులు



ఏనుమాముల మార్కెట్లో జాతీయ జెండాను ఆవిష్కరించిన శ్రీనివాస్

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 17: ప్రజాపాలన దినోత్సవాన్ని పుర స్కరించుకొని జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాళ్లు జాతీయ జెండాను ఎగురవేశారు. డీఈవో కార్యాలయంలో డీఈవో మామిడి జ్ఞానేశ్వర్, డీఐఈవో కార్యా లయంలో డీఐఈవో డాక్టర్ జి.శ్రీధర్ సుమన్ జెండాను ఎగురవేశారు. ఎంప్లాయిమెంట్ ఆఫీ స్‌లో ఎంప్లాయిమెంట్ ఆఫీసర్ సీహెచ్. ఉమారాణి, ఐటీఐలో ప్రిన్సిపాల్ జెండాలను ఎగురవేశారు.

» వరంగల్ కలెక్టరేట్: ప్రజాపాలన సందర్భంగా కలెక్ట రేట్ ప్రాంగణంలో కలెక్టర్ సత్యశారద జాతీయ ప తాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చరిత్రలో 1948 సెప్టెంబరు 17కు ఒక విశిష్టత ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం భారతదేశం లో అంతర్భాగంగా మారిందని అందుకే అంతటి ప్రా ధాన్యం ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అద నపు కలెక్టర్ సంధ్యారాణి పాల్గొన్నారు.

» ఖిలావరంగల్: ప్రజాపాలన దినోత్సవం(సెప్టెంబరు 17)లో భాగంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఖిలావరంగల్ చెమన్‌వద్ద గల అమరవీరుల స్తూపానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు, కలెక్టర్ సత్యశారద, అదనపు కలెక్టర్ సంధ్యారాణి, మేయర్ అశ్వినితానాజీ వాకిడే, 37,38,40, 41 డివిజన్ల కార్పొరేటర్లు వెల్పుగొండ సువర్ణ-సురేష్, బైరబో యిన ఉమా -దామెదర్‌యాదవ్, పోశాల పద్మ-స్వామి, గుండు చందన పూర్ణచందర్ పాల్గొ న్నారు. శివనగర్‌లోని తమ్మెర భవన్‌లో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్‌కే బాషుమియా జాతీయ జెండాను ఎగురవేశారు. తూర్పుకోట పశువుల ఆస్ప త్రిలో కార్పొరేటర్ వెల్పుగొండ సువర్ణ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో వరంగల్ ఈస్ట్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బెడిద వీరన్న, డివిజన్ అధ్యక్షుడు బోయిని దూడయ్య పాల్గొన్నారు.

» శంభునిపేట : మామునూరు ఫోర్త్ బెటాలియన్‌లో ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. మామునూరు ఫోర్త్ బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ పి.శ్రీనివాస్‌రావు జాతీయ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో ఆర్ఐలు శోభన్, పురుషోత్తం రెడ్డి, వెంకటేశ్వర్లు, రాజ్ కుమార్, కృష్ణ పాల్గొన్నారు.

» వరంగల్ వ్యవసాయం: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్లో ప్రజా పాలన వేడుకలు ఆ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి పోలెపాక నిర్మల అధ్య క్షతన నిర్వహించారు. మార్కెటింగ్ శాఖ జాయింట్ డైరెక్టర్, మార్కెట్‌పర్సన్ ఇన్‌చార్జి ఉప్పుల శ్రీనివాస్ జాతీయ జెండాను ఎగరవేశారు.



డీఈవో కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న డీఈవో జ్ఞానేశ్వర్ తదితరులు

విమోచన దినోత్సవాన్ని ఎందుకు నిర్వహించట్లేదు

బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్

మిల్స్‌కాలనీ, సెప్టెంబరు 17: సెప్టెంబరు 17న కాంగ్రెస్ ప్రభుత్వం విమోచన దినోత్సవంగా ఎందుకు నిర్వహించడం లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ ప్రశ్నించారు. మంగళవారం ధర్మారంలోని బీజేపీ జిల్లా కార్యాలయంలో బీజేపీ ఆధ్వర్యంలో విమోచన దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేసిన గంట మాట్లాడుతూ... తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా విమోచన దినోత్సవాన్ని నిర్వహించే ధైర్యం లేక ప్రజా పాలన దినత్సోవాన్ని నిర్వహిస్తుందని విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం సమైక్యత దినోత్సవాన్ని నిర్వహిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలన పేరుతో తెలంగాణ ప్రజలను వంచిస్తున్నారన్నారు. నిజాం పాలనలో అప్పటి ప్రజలు ఎదుర్కొన్న ఇబ్బందులను, నిరంకుశ పాలనను అంతమొందించేందుకు పోరాటాలు చేసిన వారి త్యాగాలను ఆయన గుర్తు చేశారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ విమోచన దినోత్సవానికి స్ఫూర్తి అన్నారు. అమరుల త్యాగాలను పాఠ్యాంశాల్లో చేర్చాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్, నాయకులు ఎడ్ల అశోక్‌రెడ్డి, బన్న ప్రభాకర్, బాకం హరిశంకర్, మల్లాడి తిరుపతిరెడ్డి, రఘునారెడ్డి, దీన్‌దయాల్, ఏకాంతంగౌడ్, రాంబాబు, మురళీకృష్ణ, నాగరాజు, క్రాంతికుమార్, నవీన్, శ్రీనివాస్, రాజు, వెంకటేశ్వర్లు, రఫీ పాల్గొన్నారు. ఆర్అండ్‌బీ కార్యాలయంలో ఈఈ జితేందర్‌రెడ్డి, నీటిపారుదల శాఖ కార్యాలయంలో ఈఈ సీతారాంనా యక్ జాతీయ జెండాలను ఎగురవేశారు.



బీజేపీ కార్యాలయంలో జెండాను ఎగురవేస్తున్న గంట రవికుమార్

విద్రోహ దినమే: సీపీఐ ఎంఎల్

ఖిలావరంగల్: సెప్టెంబరు 17విలీనం కాదు, విమోచనం కాదని, ముమ్మాటికీ విద్రోహ దినమేనని సీపీఐ-ఎంఎల్, మాస్ లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు చంద్ర న్న అన్నారు. ఖమ్మం రోడ్‌లోని గోడౌన్‌లో సీపీఐ- ఎంఎల్, మాస్‌లైన్ (ప్రజాపంథా) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో విద్రోహ దినాన్ని పాటించారు. జిల్లా కార్యదర్శి చిర్ర సూరి అధ్యక్షతన నిరసన సదస్సును చేపట్టారు. కార్యక్రమంలో సీపీఐ-ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గడ్డం సదానందం, డివిజన్ కార్యదర్శి బొట్ల రాకేష్, జిల్లా, నాయకులు అర్షం అశోక్, మైదం పాణి, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.నర్సింహారావు పాల్గొన్నారు.

వికసిత్ భారత నిర్మాణంలో భాగస్వాములమవుదాం

కరీమాబాద్, సెప్టెంబరు 17: వికసిత్ భారత నిర్మాణంలో మనమంతా భాగస్వామ్యులం అవ్వాలని, భారతదేశం సంపూర్ణ శక్తివంతమైన దేశంగా రూపుదిద్దుకోవడంలో బీజేపీ కార్యకర్తలు కీలకపాత్ర పోషించాలని బీజేపీ నాయకుడు, అర్బన్ కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్‌రావు అన్నారు. మంగళవారం 39వ డివిజన్‌లో పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ప్రదీప్‌రావు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో మన భారతదేశాన్ని అభివృద్ధిలో, ప్రజా సంక్షేమంలో ప్రథమ స్థానంలో నిలపడానికి అహర్నిషలు పాటుపడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తాబేటి వెంకట్‌గౌడ్, సిద్దం నరేష్ పటేల్, టేకుమట్ల రేణుక, కర్ని రవీందర్, మెంతుల యాదదిరి, మడిపల్లి నాగరా గౌడ్ పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న ప్రదీప్‌రావు తదితరులు

ఘనంగా గణేషుల శోభాయాత్ర



రంగశాయిపేటలో చిడుతల రామాయణం

బెస్తం చెరువులో నమజ్జనం ➤

శంభునిపేట, సెప్టెంబరు 17: రంగశాయిపేట మహంకాళీ యూత్ ఆధ్వర్యంలో మంగళవారం వైభవంగా శోభాయాత్ర నిర్వహించారు. నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండలం కేశవాపూర్‌కు చెందిన వీరహనుమాన్ కళాబృందం సీతారామాంజనేయ చెక్కభజన (చిడుతల రామాయణం) కోలాటాలు కనువిందు చేసింది. రంగశాయిపేట కటికవాడలో ఫ్రెండ్స్ యూత్, గాంధీ యూత్, మార్కండేయ యూత్, పలు వినాయకులను బెస్తం చెరువులో నిమజ్జనం చేశారు. మంగళవారం 60కి పైగా వినాయకులను బెస్తం చెరువులో నిమజ్జనం చేశారు. మామునూరు సీఐ రవికుమార్, ఎస్ఐ కృష్ణవేణిలు బందోబస్తును నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గుండు చందనపూర్ణచందర్, విగ్రహదాత మహ్మద్ పాషా, కొండ్రెడ్డి నవీన్‌రెడ్డి, కందగట్ల జీవన్, సిద్దార్థ, ప్రసాద్, తివారి మహేష్, మండల మొగిలి, కర్నె రవీందర్, ఆవునూరి రాకేష్, రాము, గీతా కరుణాకర్‌రెడ్డి, చిట్టి ఈశ్వర్ పాల్గొన్నారు.

- మహంకాళీ యూత్ గణపతి లడ్డూ ఈసారి రూ.1,15,116 పలికింది. రంగశాయిపేటకు చెందిన ఈగ అభినయ్, అవినయ్, అనూషలు లడ్డూను వేలంలో దక్కించుకున్నారు.



కేక్‌కట్ చేస్తున్న బీజేపీ నాయకులు

ఘనంగా ప్రధాని జన్మదిన వేడుకలు

మట్టెవాడ, సెప్టెంబరు 17: భారత ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుక లను పిన్నవారి వీధిలో మంగళవారం నిర్వహించారు. కార్పొరేటర్ గందె కల్పన నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో భారీ కేక్‌ను కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, డివిజన్ అధ్యక్షుడు రామిని సుమన్, బాకం హరిశంకర్, ఎరు కల రఘునారెడ్డి, బైరి శ్యామ్‌సుందర్, గోవింద్‌సింగ్, అపురూప సాయి, కొత్తపల్లి రాజేష్, నోముల రతన్, రాజేష్ పాల్గొన్నారు.

జాతీయ గీతాలాపన వివాదం!

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 17: ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మంగళవారం వర్ధన్నపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయగీతాలాపన వివాదం తెరపైకి వచ్చింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు జెండా ఆవిష్కరణ చేసిన అనంతరం జాతీయ గీతాలాపాన చేయలేదని, ఆ సమయంలో కాంగ్రెస్ నాయకులు జిందాబాద్‌లు కొట్టిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అంతేకాదు మునిసిపాలిటీ ఆవరణలో జాతీయ జెండా ఎగురవేసి రాష్ట్ర గీతమైన 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని రెండు లైన్లు మాత్రమే పాడి వదిలేయడంపై ప్రతిపక్షాల నాయకులు విమర్శలు చేస్తున్నారు. ఈ వివాదంపై వరంగల్ జిల్లా ఆత్మ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గుజ్జ గోపాల్‌రావు స్పందిస్తూ జాతీయ జెండా ఎగురవేసిన జాతీయ గీతాన్ని పాడకపోవడం, మునిసిపాలిటీలోనూ రాష్ట్ర గీతాన్ని మధ్యలో నిలిపివేయడం.. జాతీయ, రాష్ట్ర గేయాలను అవమానించడమేనని విమర్శించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి మాట్లాడుతూ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు జాతీయ గీతాన్ని పాడకపోవడం దురదృష్టకరమన్నారు. సుదీర్ఘ కాలం ఐపీఎస్ అధికారిగా పనిచేసిన కేఆర్ నాగరాజు జాతీయ గీతం పాడకపోవడం సిగ్గు చేటన్నారు. వెంటనే ఎమ్మెల్యే నాగరాజు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కుందూరు మహేందర్ రెడ్డి స్పందిస్తూ నాగరాజుకు ఎమ్మెల్యేగా కొనసాగే హక్కు లేదని విమర్శించారు.

22 మందికి జరిమానా

మట్టెవాడ, సెప్టెంబరు 17: మద్యం తాగి వాహనం నడిపిన కేసులో 22 మంది వాహనదారులకు జరిమానా, ఒక వాహనదారుడికి జైలుశిక్షను మంగళవారం వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి జరిమానా విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తెలిపారు. మద్యంతాగి వాహనం నడిపి ట్రాఫిక్ పోలీసులకు పట్టుబడ్డ 22 మంది వాహనదారులకు రూ.38,600 జరిమానా, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడిపిన నలుగురికి రూ.4,500 జరిమానా విధించినట్లు తెలిపారు.

ఫార్మసిస్టులకు మెమోలు

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 17 : మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో కాలం చెల్లిన మందులు రోగులకు ఇవ్వడంపై మంగళవారం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ రామ్మూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫార్మసిస్టులు విమలాదేవి, శశిభూషన్‌కు మెమోలు అందజేసినట్లు తెలిపారు. దీనిపై విచారణ చేసి పూర్తి నివేదిక ఇవ్వాలని డాక్టర్ విజయ్ కుమార్‌ను ఆదేశించినట్లు పేర్కొన్నారు. సోమవారం దాదాపు 300 మంది మందులు తీసుకోగా, అందులో ఎంత మందికి కాలం చెల్లిన మందులు ఇచ్చారో వైద్యులకే తెలియకపోవడం గమనార్హం.

ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు

మట్టెవాడ, సెప్టెంబరు 17: కుల వృత్తులకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తున్నట్లు మంత్రి కొండా సురేఖ తెలిపారు. మంగళవారం విశ్వకర్మ జయంతి ఉత్సవాల సందర్భంగా వరంగల్ విశ్వకర్మ వీధిలోని విశ్వకర్మ స్వర్ణకార భవనంలో విశ్వకర్మ మహాయజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. అలాగే రామన్నపేటలోని విశ్వకర్మ కార్పెంటర్స్ డెవలప్‌మెంట్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన మహోత్సవంలో మంత్రి పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్‌రాజ్, హరీష్, రమేశ్, వేణుమాధవ్, విశ్వకర్మ సంఘం నాయకులు జయసాగర్, జగన్, నాగరాజు, శ్రీనివాసచారి, ప్రవీణ్ కుమార్, రాజేష్, రవీందర్ పాల్గొన్నారు.

- వరంగల్ కలెక్టరేట్: బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో మంగళవారం విశ్వకర్మ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. హనుమకొండ లష్కర్ బజారులోని బీసీ సంక్షేమశాఖ, బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో మద్విరాట్ విశ్వకర్మ భగవాన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి పుష్పలత, గ్రేటర్ వరంగల్ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు ఉల్లి వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కినపల్లి సతీష్ కుమార్, అలుగోజు కృష్ణమూర్తి, శంకరయ్య, లవకుమార్ పాల్గొన్నారు.
- వరంగల్ కల్చరల్: వరంగల్ భద్రకాళి దేవాలయం సమీపంలోని మద్విరాట్ పోతులూరి గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయం ప్రాంగణంలో విరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మారెడోజు సదానందచారి ఆధ్వర్యంలో ఆలయ ప్రధానార్చకులు గుటోజు కేదారేశ్వరచారి భక్తి ప్రపత్తులతో యజ్ఞమహోత్సవ తంతును చేపట్టారు. అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.
- వరంగల్ కల్చరల్: వరంగల్ భద్రకాళి బండ్ ప్రాంతంలోని జానపద గిరిజన విజ్ఞాన పీఠంలో తెలంగాణ ప్రజా పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పీఠాధిపతి ఆచార్య భూక్య బాబురావు జాతీయ జెండాను ఎగరవేశారు.



విశ్వకర్మ భగవాన్ చిత్రపటం ముందు నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎన్‌కౌంటర్లను ఆపాలి

శంభునిపేట, సెప్టెంబరు 17: ప్రజా పాలన అని చెప్పిన రేవంత్ సర్కార్ బూటకపు ఎన్‌కౌంటర్‌లను ఆపాలని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు గంగుల దయాకర్, బండి కోటేశ్వర్‌రావులు డిమాండ్ చేశారు. న్యూడెమోక్రసీ నాయకులు రాచర్ల బాలరాజు అధ్యక్షతన రంగశాయిపేట జంక్షన్‌లో మంగళవారం ప్రజా సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. దయాకర్, కోటేశ్వర్‌రావులు మాట్లాడుతూ సెప్టెంబరు 17 హైదరాబాద్ స్వతంత్ర్య రాజ్యాన్ని ఇండియాలో విలీనం చేసిన రోజు అని ఇది విద్రోహ దినమని తెలిపారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా నాయకులు సాంబయ్య, ఇనుముల కృష్ణ, శరత్, మహేష్, యాకయ్య పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న న్యూడెమోక్రసీ నాయకులు



ఆంధ్రజ్యోతి WARANGAL RURAL బుధవారం 18 సెప్టెంబరు 2024

వరంగల్ రూరల్

• నర్సంపేట • దుగ్గొండి • చెన్నారావుపేట • ఖానాపురం • నల్లబెల్లి • నెక్కొండ • పర్వతగిరి • వర్ధన్నపేట • రాయపర్తి • సంగెం • గీసుగొండ

ఘనంగా విశ్వకర్మ జయంతి

దుగ్గొండి, సెప్టెంబరు17: మండల కేంద్రంలో విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం విశ్వకర్మ జయంతి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్ఆర్ఐ బీఆర్ఎస్ సెల్ నాయకులు రాజ్‌కుమార్ పాల్గొని విశ్వకర్మ చిత్రపటానికి పూలమాల వేశారు. మండల అధ్యక్షుడు చంద్రాచారి, బ్రహ్మం, చంద్రమౌళి, ఎం రాజు, ఎలిశోదు శ్రీనివాస్, సత్యం, బ్రహ్మచారి, నర్సింహాచారి, మోడెం విద్యాసాగర్, అంబీరు రమేశ్, శంకర్‌లు పాల్గొన్నారు.

● గీసుగొండ/రాయపర్తి : మండల కేంద్రంలోని వీరబ్రహ్మేంద్రస్వామి, ధర్మారంలోని రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో మంగళవారం విశ్వబ్రాహ్మణులు యజ్ఞం చేశారు. అలాగే శోభాయాత్ర నిర్వహించారు. ధర్మారంలో కొక్కొండ శ్రీకాంత్, యాదగిరి, మదన్‌మోహన్, యుగేందర్, రవీందర్, నవీన్, హరికృష్ణ, హరినాథ్, గీసుగొండలో భిక్షపతి, రామ్మూర్తి, బ్రహ్మచారి, మొగిలి, రాజేంద్రచారి, రఘు పాల్గొన్నారు. అలాగే రాయపర్తి మండలంలో వేడుకలు నిర్వహించారు. రామనాథం, యాదమచారి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి

మహిళా సంఘాలకు అండగా ప్రభుత్వం

- పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి
- ప్రగతి సమాఖ్య 15వ వార్షికోత్సవం

గీసుగొండ, సెప్టెంబరు 17: మహిళా పొదుపు సంఘాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. గీసుగొండ మండల ప్రగతి సమాఖ్య 15వ వార్షికోత్సవం కోనాయిమాకుల వద్ద మండల సమాఖ్య భవనంలో మంగళవారం జరిగింది. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎంతో మాట్లాడి టెక్స్‌టైల్ పార్కు పరిశ్రమల టెక్స్‌టైల్ పనులు ఇంటివద్దనే మహిళలచే చేయించేందుకు అవకాశాలను పరిశీలిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో కమలాకర్, ఎంపీవో ప్రభాకర్, ఏపీఎం సురేష్, సీసీలు అశోక్, శోభారాణి, సుజాత, మండల సమాఖ్య అధ్యక్షురాలు కవిత, మాజీ ఎంపీపీ భీమగాని సౌజన్య పాల్గొన్నారు.

రౌడీయిజం చేస్తే ఊరుకోను..

కొంతమంది పెద్దసార్లు గుడుంబా తయారీదారులకు మద్దతు ఇచ్చి ఏకంగా సీఐనే బదిలీ చేయాలని చూస్తున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు. గుడుంబా అరికట్టడంలో నిజాయితీగా పనిచేస్తున్న సీఐకే ఫోన్ చేసి అటువైపు వెళ్లద్దని అనటం వారి విజ్ఞతకే వదిలిపెడుతానన్నారు. నా వెనుక రౌడీయిజం చేయాలని కొందరు కుట్రలు చేస్తున్నారని వారిని వదిలిపెట్టనన్నారు.

ఎట్టకేలకు రోడ్డు పనులు ప్రారంభం



సంగెం, సెప్టెంబరు 17: భారీ వర్షాలకు కల్వర్టు రోడ్డు తెగి ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా సందర్శించిన పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి వెంటనే తాత్కాలిక రోడ్డు పనులు చేపట్టాలని చేసిన ఆదేశాల మేరకు మంగళవారం పనులను ప్రారంభం అయ్యాయి.

మండలంలోని నార్లవాయి క్రాస్ రోడ్డు వద్ద వరదనీటికి రోడ్డు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోవడంతో ఈనెల 2న సందర్శించిన ఎమ్మెల్యే సంబంధిత అధికారులను పనుల చేపట్టాలని ఆదేశించినా ఫలితం లేకపోవడంతో సోమవారం మరో మారు సందర్శించి అధికారులు, కాంట్రాక్టర్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో మంగళవారం తాత్కాలిక రోడ్డు పనులను చేపట్టారు.

ఎన్‌సీసీ పోటీల్లో ధర్మారం విద్యార్థుల ప్రతిభ

గీసుగొండ, సెప్టెంబరు 17: ఎన్‌సీసీ వార్షిక ట్రైనింగ్‌లో భాగంగా కాకతీయ యూనివర్సిటీలో నిర్వహించిన ఆటల పోటీలలో ధర్మారం ఎన్‌సీసీ కేడెట్‌లు ఖోఖో, టగ్ ఆఫ్ వార్, సోలో డాన్స్‌లో ప్రతిభ కనబరిచి మొదటి స్థానాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ సాంబయ్య తెలిపారు. కాగా ప్రతిభ కనబరిచిన కేడెట్‌లను ఉపాధ్యాయులు మంగళవారం అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ ఇన్‌చార్జి కుమారస్వామి, ఎం.డీ నజారుద్దీన్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రజాపాలన దినోత్సవం

- ఊరూరా జాతీయజెండాల ఆవిష్కరణ
- యోధుల త్యాగాలను కొనియాడిన వక్తలు
- పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు

నర్సంపేట, సెప్టెంబరు 17: తెలంగాణ పరిపాలన దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ గుంటి రజని జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో కమిషనర్ జోనా, కౌన్సిలర్లు మహబూబ్ పాషా, విజయ్‌కుమార్, సాంబయ్యగౌడ్, ఇన్‌చార్జి మేనేజర్ రజినీ, ఎంఏఆ రాజేశ్ పాల్గొన్నారు. ఆర్డీవో కార్యాలయంలో ఏవో శ్రీనివాస్‌రావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. తెలంగాణ సాంస్కృతిక సారథి నర్సంపేట టీమ్ లీడర్ నెల్లుట్ల సుమన్ ఆధ్వర్యంలో కళాకారులు టి.సునీల్, యోచన, పడిదం రాజేందర్, బరిగెల రవీందర్ ఆటపాటలతో రైతాంగ సాయుధ పోరాటాన్ని వివరించారు. పట్టణంలోని సీనియర్ సిటిజన్ అసోసియేషన్ కార్యాలయం వద్ద అసోసియేషన్ అధ్యక్షుడు నల్లమనోహర్‌రెడ్డి జాతీయజెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో ఆ సంఘం కార్యదర్శి ఎం రామారావు, ఈశ్వరమూర్తి, గండి లింగయ్య, వడ్లకొండ సాంబయ్య, వెంకటేశ్వర్లు, మల్లయ్య పాల్గొన్నారు.

● దుగ్గొండి : మండల పరిషత్‌లో ఎంపీడీవో అరుంధతి, తహసీల్దార్ కార్యాలయంలో డీటీ ఉమాదేవి, పోలీసు స్టేషన్‌లో ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు, హైస్కూల్‌లో హెచ్‌ఎం రామస్వామి, నాచినపల్లిలో పీఏసీఎస్‌లో అధ్యక్షుడు సుకినె రాజేశ్వర్‌రావు, సీఈవో సోమ ఓంకార్, వెంకటాపురంలో వీడీఎఫ్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్‌రెడ్డి జాతీ య జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో శ్రీధర్ గౌడ్, ఎంపీవో రాజ్‌కుమార్‌లు పాల్గొన్నారు.

● ఖానాపురం : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో భారతి, తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ రాజారేణుక, పోలీస్ స్టేషన్‌లో ఎస్సై రఘుపతి, మండల కేంద్రంలోని రైతువేదికలో ఏవో భోగ శ్రీనివాస్, కస్తూర్బా గురుకులంలో ఎస్‌వో మేనక, జీపీ కార్యాలయాల్లో స్పెషల్ ఆఫీసర్లు జాతీయ జెండాలను ఆవిష్కరించారు.

● నెక్కొండ : మండలంలోని సొసైటీ కార్యాలయం వద్ద చైర్మన్ మారం రాము, వ్యవసాయ మార్కెట్ ఎదుట చైర్మన్ రావుల హరీష్‌రెడ్డి, తహసీల్ కార్యాలయం ఎదుట తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో కార్యాలయం వద్ద ఎంపీడీవో జీ దయాకర్, పీఎస్‌లో ఎస్సై మహేందర్, వ్యవసాయ కార్యాలయంలో ఏవో నాగరాజు, ఎమ్మార్సీ ఎదుట ఎంఈవో రత్నమాల, జీపీ కార్యాలయం ఎదుట కార్యదర్శులు జెండాలను ఎగురవేశారు.

● నల్లబెల్లి : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కృష్ణ జాతీయ జెండాను ఎగురవేశారు. సిబ్బంది పాల్గొన్నారు.

● చెన్నారావుపేట : మండల కేంద్రంలోని మండల పరిషత్, తహసీల్ కార్యాలయాల వద్ద ఎంపీడీవో శ్రీవాణి, తహసీల్దార్ ఫణికుమార్, పోలీసు స్టేషన్‌లో ఎస్సై రాజేష్‌రెడ్డి, సహకార సంఘం కార్యాలయం వద్ద సొసైటీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి వేడుకల్లో పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు గోపాల్‌నాయక్, లింగాపురంలో బీజేపీ మండల అధ్యక్షుడు డి.రంజిత్‌లు జాతీయ జెండాలను ఎగురవేశారు.

● వర్ధన్నపేట రూరల్ : మండలంలోని జీపీ కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఆవిష్కరించారు. పట్టణంలోని తహసీల్దార్, ఎంపీడీవో, పోలీస్ స్టేషన్లతో పాటు వివిధ కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు. దీనికి తోడు బీఆర్ఎస్, బీజేపీ పార్టీల ఆధ్వర్యంలో సైతం పట్టణం, ఆయా గ్రామాల్లో తెలంగాణ ప్రజాపాలన దినోత్సవాన్ని నిర్వహించారు.

● సంగెం : మండలంలో తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కానర్ల రవీందర్, పీఎస్‌లో ఎస్సై నరేష్, వ్యవసాయ కార్యాలయంలో వ్యవసాయాధికారి యాకయ్య, సొసైటీ కార్యాలయంలో చైర్మన్ కుమార స్వామియాదవ్ జాతీయ జెండా ఎగురవేశారు. మాజీ జడ్పీటీసీ సుదర్శన్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కళావతి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి పాల్గొన్నారు.

● గీసుగొండ : ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో కమలాకర్, పోలీస్‌స్టేషన్‌లో సీఐ బాబులాల్, జాతీయ జెండాల ను ఎగురవేశారు.

● నర్సంపేట టౌన్ : గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో స్పెషల్ ఆఫీసర్లు జాతీయ జెండాలను ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలల్లో వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు చంద్రకళ, రవికుమార్, రవీందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

● పర్వతగిరి : పర్వతగిరి జీపీలో ఎంపీడీవో శంకర్‌నాయక్, రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ వెంకటస్వామి, పోలీస్‌స్టేషన్‌లో ఎస్సై ప్రవీణ్, గ్రంథాలయంలో లైబ్రేరియన్ రాంచందర్, పీహెచ్‌సీలో డాక్టర్ ఉదయ్ జాతీయజెండాను ఆవిష్కరించారు.

● రాయపర్తి : తహసీల్దార్, పోలీస్ స్టేషన్, ఎంపీడీవో కార్యాలయాల్లో జాతీయ జెండాలను ఎగురవేశారు. గ్రామాల్లోని జీపీ కార్యాలయంలో స్పెషల్ ఆఫీసర్లు జెండాలను ఆవిష్కరించారు. రాయపర్తిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి జెండాను ఎగురవేశారు.

బీజేపీ ఆధ్వర్యంలో విమోచన దినోత్సవం

ఖానాపురం : బీజేపీ ఆధ్వర్యంలో ధర్మరావుపేట గ్రామంలో మంగళవారం తెలంగాణ విమోచన దినోత్సవ వేడుకలను నిర్వహించారు. జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో బీజేపీ కార్యకర్తలు యాకసాయన్న, అటికె కుమారస్వామి, కొడిమాల యాకస్వామి, తక్కళ్లపల్లి యాదగిరిరావు, ఎర్రబెల్లి దిలీప్‌రావు, వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో రక్తదానం

నర్సంపేట : తెలంగాణ విమోచన దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ రక్తదాన శిబిరం ప్రారంభించారు. నర్సంపేటకు చెందిన బీజేపీ నాయకులు కంభంపాటి ప్రతాప్, అరుణ్, కార్యకర్తలు రక్తదానం చేశారు.



నర్సంపేటలో జాతీయ జెండాకు వందనం చేస్తున్న అధికారులు



హైదరాబాద్‌లో కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆధ్వర్యంలో రక్తదానం చేస్తున్న బీజేపీ నర్సంపేట నాయకులు



ఖానాపురం పీఎస్‌లో జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న పోలీసులు

సెప్టెంబరు 17 తెలంగాణ విద్రోహ దినమే

న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నిరసన

నర్సంపేట టౌన్ : పాలకవర్గ పార్టీలు ప్రజాపాలన, విమోచన, విలీనం అని రకరకాల పేర్లతో ప్రజలను మోసం చేస్తున్నారని, సెప్టెంబర్ 17 ముమ్మాటికీ తెలంగాణ విద్రోహ దినమేనని న్యూడెమోక్రసీ నాయకుడు ఎలకంటి రాజేందర్ అన్నారు. సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వ ర్యంలో మంగళవారం నర్సంపేట పట్టణంలోని అంబేద్కర్ సెంటర్‌లో నిరస న వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో దోపిడీ, అణచివేత ఉన్నంత కాలం విప్లవోద్యమం సజీవంగా ఉంటుం దన్నారు. దేశంలో మోదీ ప్రభుత్వం, రాష్ట్రంలో రేవంత్ ప్రభుత్వం కార్పొ రేట్ శక్తుల ప్రయోజనాల కోసం పని చేస్తున్నాయన్నారు. ఈ కార్యక్ర మంలో న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



నర్సంపేటలో నిరసన వ్యక్తం చేస్తున్న న్యూడెమోక్రసీ నాయకులు

సార్వత్రిక విద్యను సద్వినియోగం చేసుకోవాలి

నర్సంపేట టౌన్, సెప్టెంబరు 17 : చదువును మధ్యలో ఆపివేసిన వారు సార్వత్రిక విద్యను సద్విని యోగం చేసుకోవాలని ఓపెన్ స్కూల్స్ ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ శంకర్‌రావు అన్నారు. పట్టణంలోని ఎస్ఆర్ ఒకేషనల్ కళాశాలలో తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ ఆధ్వ ర్యంలో నిర్వహిస్తున్న ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశాలకు సంబం ధించిన పోస్టర్లు, కరపత్రాలను మంగళవారం శంకర్‌రావు ఆవిష్కరించారు. కళాశాల కరస్పాండెంట్ కొయ్యడి సనత్‌కుమార్ డైరెక్టర్ శిరీష, అధ్యాపకులు పాల్గొన్నారు.

గుడిని తొలగించొద్దని నిరసన

ఖానాపురం, సెప్టెంబరు 17: మండలంలోని వేపచెట్టు తండాలోని హనుమాన్ గుడిని తొలిగించవద్దని గ్రామస్తులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ జాతీయ రహదారి విస్తరణలో రోడ్డు పక్కన ఉన్న హనుమాన్ గుడిని తొలగించకుండా ప్రత్యామ్నాయ మార్గంలో రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు ధరావత్ హేమ, భూక్య లక్ష్మణ్, భూక్య వెంకన్న, గుగులోతు లింబ, ధరావత్ బిచ్చా, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

రాయపర్తి, సెప్టెంబరు 17 : బైక్‌లు ఎదురెదురుగా ఢీకొని ఇద్దరికి గాయాలైన ఘటన మండలంలోని రాగన్నగూడెంలో మంగళవారం జరిగింది. ఏఎస్ఐ సదానందం కథనం ప్రకారం.. మండలంలోని పెర్కవేడు గ్రామానికి చెందిన బండి కుమార్, బండి సోమయ్యలు బైక్‌పై మండల కేంద్రానికి వెళ్తుండగా, రాయపర్తి నుంచి పెర్కవేడుకు వస్తున్న కేసముద్రం మండలం కోరుకొండపెల్లికి చెందిన జీ నవీన్ ఢీకొన్నారు. దీంతో ముగ్గురు గాయపడ్డారు. స్థానికులు వారిని అంబులెన్సులో ఆసుపత్రికి తరలించారు.

దీక్షలకు అంకురార్పణ

గీసుగొండ, సెప్టెంబరు 17: ఊకల్‌లో సుబ్రహ్మణ్యస్వామి దీక్షలకు అంకురార్పణను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ నెల 19 నుంచి 23 వరకు మాలధారణలు చేయబడుతాయని పూజారి సుదర్శనాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు శ్రీహర్షాచార్యులు, ఆలయ కమిటీ అధ్యక్షుడు బాబురావు, కొత్తగట్టు రాజేందర్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫార్మసిస్టులకు మెమోలు

సీహెచ్‌సీలో రోగులకు కాలం చెల్లిన మందులు ఇచ్చారని వేటు

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 17 : మండల కేంద్రంలోని సీహెచ్‌సీలో కాలం చెల్లిన మందులు రోగులకు ఇవ్వడంపై మంగళవారం సీహెచ్‌సీ సూపరింటెండెంట్ రామ్మూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫార్మసిస్టులు విమలాదేవి, శశిభూషణ్‌కు మెమోలు అందజేసినట్లు తెలిపారు. దీనిపై విచారణ చేసి పూర్తి నివేదిక ఇవ్వాలని డాక్టర్ విజయ్ కుమార్‌ను ఆదేశించినట్లు పేర్కొన్నారు. సోమవారం దాదాపు 300 మంది మందులు తీసుకోగా, అందులో ఎంత మందికి కాలం చెల్లిన మందులు ఇచ్చారో వైద్యులకే తెలియకపోవడం గమనార్హం.

రాష్ట్రస్థాయి ఖోఖోలో ప్రతిభ చాటిన అభినవ్

నర్సంపేట, సెప్టెంబరు 17 : హైదరాబాద్‌లో ఈనెల 13 నుంచి 15 వరకు జరిగిన రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల 8వ తరగతి విద్యార్థి బోయిన అభినవ్ ఉమ్మడి జిల్లా తరఫున తృతీయస్థానం సాధించాడు. ఈ సందర్భంగా స్కూల్‌లో మంగళవార అభినవ్‌ను హెచ్‌ఎం కొర్రసారయ్య, పీడి కోటరాంబాబు, ఉపాధ్యాయులు అభినందించారు.

గోదాం నిర్మాణానికి స్థలం కేటాయించాలి

చెన్నారావుపేట, సెప్టెంబరు 17: మండలంలోని జల్లి గ్రామంలో ప్రాథమిక సహకార సంఘం వారు నిర్మాణం కోసం ప్రభుత్వ స్థలంను కేటాయించాలని సొసైటీ మాజీ వైస్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు తొగరు చెన్నారెడ్డి అన్నారు. మంగళవారం డీటీ రజనీకి వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ విజేందర్, రాజు, శ్యామ్, శ్రీను, మహేష్, శంకర్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా, ఇద్దరికి గాయాలు

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 17 : ప్రమాదవశాత్తు ఆటో అదుపు తప్పి బోల్తా పడిన ఘటన మండలంలోని కట్ర్యాల గ్రామశివారులో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్ కుమార్ కథనం ప్రకారం.. కట్ర్యాల శివారులోని వరంగల్-ఖమ్మం హైవేపై ఆటో బోల్తా పడడంతో డ్రైవర్ అశోక్‌తో పాటు మరో వ్యక్తి వేముల నాగరాజుకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ ప్రవీణ్ కుమార్ 108 వాహనంలో దవాఖానకు తరలించారు.

ప్రజాపాలన వేడుకలో జాతీయ గీతాలాపన వివాదం

జెండా ఆవిష్కరణ తర్వాత నాయకులు జిందాబాద్ కొట్టడమేంటని ప్రతిపక్షాల అభ్యంతరం

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 17 : ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా మంగళవారం వర్ధన్నపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో జాతీయగీతాలాపన వివాదం తెరపైకి వచ్చింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు జెండా ఆవిష్కరణ చేసిన అనంతరం జాతీయ గీతాలాపాన చేయలేదని, ఆ సమయంలో కాంగ్రెస్ నాయకులు జిందాబాద్‌లు కొట్టిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. అంతేకాదు మునిసిపాలిటీ ఆవరణలో జాతీయ జెండా ఎగురవేసి రాష్ట్ర గీతమైన 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని రెండు లైన్లు మాత్రమే పాడి వదిలేయడంపై ప్రతిపక్షాల నాయకులు విమర్శలు చేస్తున్నారు. ఈ వివాదంపై వరంగల్ జిల్లా ఆత్మ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గుజ్జ గోపాల్‌రావు స్పందిస్తూ జాతీయ జెండా ఎగురవేసిన జాతీయ గీతాన్ని పాడకపోవడం, మునిసిపాలిటీలోనూ రాష్ట్ర గీతాన్ని మధ్యలో నిలిపివేయడం.. జాతీయ, రాష్ట్ర గేయాలను అవమానించడమేనని విమర్శించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి మాట్లాడుతూ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు జాతీయ గీతాన్ని పాడకపోవడం దురదృష్టకరమన్నారు. సుదీర్ఘ కాలం ఐపీఎస్ అధికారిగా పనిచేసిన కేఆర్ నాగరాజు జాతీయ గీతం పాడకపోవడం సిగ్గు చేటన్నారు. వెంటనే ఎమ్మెల్యే నాగరాజు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. మరోవైపు బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కుందూరు మహేందర్ రెడ్డి స్పందిస్తూ నాగరాజుకు ఎమ్మెల్యేగా కొనసాగే హక్కు లేదని విమర్శించారు.



మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగరాజు

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి : ఎమ్మెల్యే

వర్ధన్నపేట రూరల్, సెప్టెంబరు 17 : గ్రామీణ ప్రాంత మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేలా కృషి చేయాలని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అన్నారు. మంగళవారం మండలంలోని ఇల్లంద గ్రామంలో ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్ ద్వారా లబ్ధి పొందిన మహగణపతి టిఫిన్ మొబైల్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి మహిళల కోసం ఇందిరా మహిళా శక్తి పథకాన్ని తీసుకువచ్చారని గుర్తు చేశారు. ఈ అవకాశాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అంతకు ముందు ప్రజాపాలన దినోత్సవం సందర్భంగా పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, మునిసిపాలిటీ కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆంగోతు అరుణ, టీపీసీసీ లీగల్ సెల్ వైస్‌చైర్మన్ నిమ్మాని శేఖర్‌రావు, మండల పార్టీ అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, తాళ్లపెల్లి శ్రీనివాస్, పోశాల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడిగా మల్లయ్య

ఖానాపురం, సెప్టెంబరు 17: తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) మండల కమిటీని ఎన్నుకున్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన టీపీటీఎఫ్ మండల సర్వసభ్య సమావేశానికి టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ హాజరై నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా దూబని మల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా షైన శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా కర్ణాకర్, సోమలక్ష్మి, కార్యదర్శులుగా సారయ్య, శోభారాణి, రమాదేవి, జిల్లా కౌన్సిలర్‌గా గంజి లక్ష్మిని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా జిల్లా ఉపాధ్యక్షుడు గంజి లక్ష్మీపతి, ఎన్నికల పరిశీలకులుగా జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు వ్యవహరించారు. ఈ సందర్భంగా నూత న అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఉపాధ్యా య, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం నిబద్ధతతో పని చేస్తామని, కామన్ స్కూల్ విద్యా విధానం కోసం పోరాడతామని తెలిపారు.



మల్లయ్య



శ్రీనివాస్

తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం

సచివాలయం వద్ద రాజీవ్‌గాంధీ విగ్రహ ఏర్పాటుపై బీఆర్ఎస్ నిరసన



బోల్లోనిపల్లిలో విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నెక్కొండ, సెప్టెంబరు 17 : సచివాలయం వద్ద రాజీవ్‌గాంధీ విగ్రహావిష్కరణకు నిరసనగా మంగళవారం నెక్కొండలో బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సూరయ్య, పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, సొసైటీ చైర్మన్ మారం రాము, మాజీ ఎంపీపీ జాటోతు రమేశ్, నాయకులు పాల్గొన్నారు.

● పర్వతగిరి : మండల కేంద్రంలో తెలంగాణ తల్లి ఫ్లెక్సీకి బీఆర్ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ మాలతి-సోమేశ్వర్‌రావు, మాజీ ఎంపీటీసీ మాడుగుల రాజు, మాజీ సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

● రాయపర్తి : మండలంలోని శివరాంపురంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి మంగళవారం బీఆర్ఎస్ నాయకులు క్షీరాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బిల్లా సుధీర్‌రెడ్డి, జీనుగు అనిమిరెడ్డి, ఆకుల సురేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

● వర్ధన్నపేట రూరల్ : మండలంలోని ఇల్లంద గ్రామంలో బీఆర్ఎస్ నాయకులు తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. మాజీ ఎంపీపీ అప్పారావు, మాజీ జడ్పీటీసీ మార్గం భిక్షపతి, మాజీ వైస్ ఎంపీపీ చొప్పరి సోమలక్ష్మి, కౌన్సిలర్ రాజమణి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు అంబటి ఎల్లస్వామి తదితరులు పాల్గొన్నారు.

● నర్సంపేట : పట్టణంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు వెంకటనారాయణగౌడ్ పార్టీ నాయకులతో కలిసి క్షీరాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నల్ల మనోహర్‌రెడ్డి, మండల శ్రీనివాస్, పెండ్యాల యాదగిరి, రావుల సతీష్, శివరాత్రి స్వామి, నాగిశెట్టి ప్రసాద్, బీరం నాగిరెడ్డి, సారంగపాణి, గందె చంద్రమౌళి, బండి రమేశ్, పుల్లూరి స్వామి, పెండెం వెంకటేశ్వర్లు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

● నల్లబెల్లి : మండలంలోని బోలోనిపల్లిలో తెలంగాణ తల్లి విగ్రహానికి బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సారంగపాణి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు చెట్టుపల్లి మురళీధర్, కోటిలింగాచారి, శ్రీనివాస్‌గుప్తా, ఇంగ్లి శివాజీ, మామిండ్ల మోహన్‌రెడ్డి, గోనె రాంబాబు, గుమ్మడి వేణు, లావుడ్య తిరుపతి, ఊరటి అమరేందర్ తదితరులు పాల్గొన్నారు.